జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో కోళ్ల ప్రదీప్‌రాజ్, సందీప్ జల్వాయ్

అబిడ్స్: రాజస్థానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. నిరుద్యోగుల కోసం శనివారం బేగంబజార్‌లోని శృంగృషి భవన్‌లో జాబ్‌మేళా చేపట్టారు. డిగ్రీ, పీజీతో పాటు పలు కోర్సులలో ప్రావీణ్యత పొందిన నిరుద్యోగ యువత పాలుపంచుకున్నారు. పలు పేరుగాంచిన కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాలుపంచుకున్నాయి. బేగంబజార్, గోషామహల్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన దాదాపు 500 మంది నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాల కోసం పాల్గొని ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాబ్ మేళా ఫౌండర్ సందీప్ జల్వాయ్, బేగంబజార్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కోళ్ల ప్రదీప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్‌లో యువతకు ప్రాధాన్యం



యాసర్ అర్ఫాత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మహ్మద్ జాహెద్

గోల్కొండ: మజ్లిస్ పార్టీలో యువతకు ఎప్పుడూ ప్రాధాన్యం ఉంటుందని మజ్లిస్ యువజన విభాగం అధ్యక్షుడు యాసర్ అర్ఫాత్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్ జాహెద్ యాసర్ అర్ఫాత్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికను అందజేశారు. అనంతరం యాసర్ అర్ఫాద్ మాట్లాడుతూ..వికలాంగుల సహాయం కోసం మజ్లిస్ పార్టీలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మజ్లిస్ కేంద్ర కార్యాలయం దారుసల్లాంలో పనిదినాల్లో దివ్యాంగుల సెల్ ఉంటుందని వారికి సంబంధించిన అన్ని సమస్యలు అక్కడ ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ తాహేర్ తదితరులున్నారు.

సునీతకు ఉత్తమ టీచర్ అవార్డు



అఫ్జల్‌గంజ్: వివేకానంద విద్యువిహార్ బండ్లగూడ జాగీర్ ఉపాధ్యాయురాలు ఎర్ర సునితకు ఉత్తమ టీచర్ అవార్డు-2025 అందజేశారు. శనివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆమెకు ఐసీఎఫ్ఏఐ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విజయలక్ష్మి, ఆర్ట్ సొసైటీ హైదరాబాద్ అధ్యక్షుడు ఎంవి.రమణారెడ్డి ఆమెకు అవార్డు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సునిత మాట్లాడుతూ..ఉత్తమ టీచర్ అవార్డు లభించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థులను విద్యతో పాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు.

'కోట'కు పర్యాటక శోభ



గోల్కొండ కోటలో కిటకిటలాడుతున్న సందర్శకులు

గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట శనివారం భారీ సంఖ్యలో వచ్చిన పర్యాటకులతో కిటకిటలాడింది. కోటలోని చారిత్రక కట్టడాలు పర్యాటక శోభను సంతరించుకున్నాయి. వర్షాలను సైతం లెక్క చేయకుండా పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు గోల్కొండ, నగీనాబాగ్, భక్త రామదాసు చరసాల, ఆయుధాగారం తదితర ప్రాంతాల్లో సందడి చేశారు. ఆయుధ గారంలోని కుతుబ్‌షాహీ కాలం నాటి ఆయుధాలను పర్యాటకులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కోట ప్రధాన ద్వారం వద్ద ఉన్న క్లాపింగ్ పోర్టిపో పనితనాన్ని చూసి పర్యాటకులు నోరెళ్లబెట్టారు. అక్కడ ఉన్న భారీ ఫిరంగి వద్ద యువ జంటలు, యువకులు సెల్ఫీలు దిగడానికి పోటీలు పడ్డారు.

దంచికొట్టిన వాన

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శనివారం వర్షం దంచికొట్టింది. మెహిదీపట్నం, లంగర్‌హౌస్ రోడ్డు, షేక్‌పేట్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఒకేసారి కురిసిన వర్షానికి ద్విచక్ర వాహనదారులు మెహిదీపట్నం పి.వి.ఎన్.ఆర్.ఎక్స్‌ప్రెస్‌వే ఫ్లై ఓవర్, టోలిచౌకీ ఫ్లై ఓవర్, షేక్‌పేట్ నాలా ఫ్లై ఓవర్‌ల కింద తలదాచుకున్నారు.



జలమయమైన టోలిచౌకీ చౌరస్తా

అక్రమ పార్కింగ్‌లతో అవస్థలు

- ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ చిక్కులు
- పలు ప్రాంతాల్లో పని చేయని సిగ్నల్స్
- నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గోల్కొండ బంజారా దర్వాజా వద్ద ట్రాఫిక్ జామ్

గోల్కొండ: ప్రధాన కూడళ్లతో పాటు ప్రధాన రహదారులపై ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. మెహిదీపట్నం మెరాజ్ చౌరస్తా, మెయిన్ బస్టాప్, టోలిచౌకీ చౌరస్తా, రేతిబౌలి చౌరస్తా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. గోల్కొండ బంజారా దర్వాజా, షేక్‌పేట్, సీతారామాంజనేయ స్వామి ఆలయం చౌరస్తా, సెవన్ టూంబ్స్ చౌరస్తా తదితర ప్రాంతాలు సైతం ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసిన సిగ్నల్స్ లైట్లు పని చేయడం లేదు. దీంతో సెవన్ టూంబ్స్ చౌరస్తా, సీతారాంజనేయ స్వామి ఆలయం చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఇష్టారాజ్యంగా వాహనాలు నడపంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది లేకపోవడం గమనార్హం.

మెహిదీపట్నం టు నానల్‌నగర్ రోడ్డుపై నరకం..

మెహిదీపట్నం నుంచి నానల్‌నగర్ వెళ్లాలంటే వాహనదారులు నరకయాతన పడుతున్నారు. రేతిబౌలి చౌరస్తా నుంచి నానల్‌నగర్ వెళ్లడానికి ఉదయం , రాత్రి వేళల్లో కనీసం 15 నిమిషాలు పడుతుంది. ఇదిలా ఉండగా ఫ్లోర్‌మిల్ నుంచి లంగర్‌హౌస్ వెళ్లే రోడ్డు సైతం ట్రాఫిక్ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. మెహిదీపట్నం బస్టాప్ నుంచి మసాబ్‌ట్యాంక్ ఫ్లై ఓవర్‌కు వెళ్లే మెయిన్‌రోడ్డు మరో ట్రాఫిక్ జామ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

ఫలితం ఇవ్వని ప్రయోగాలు..

ట్రాఫిక్ జామ్‌లను నివారించడానికి ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న ప్రయోగాలు పూర్తిగా విఫలం అవుతున్నాయి. ఫ్రీ లెఫ్ట్, ఆఫ్ రోడ్ లాంటి ప్రయోగాలు ఇప్పటికే బెడిసికొట్టాయి. రేతిబౌలి నుంచి నానల్‌నగర్‌కు వెళ్లడానికి ఉన్న రోడ్డే కాకుండా కుడి వైపు ఉన్న రోడ్డును కూడా ట్రాఫిక్ పోలీసులు సగం రోడ్డుకు తాడు బిగించి టోలిచౌకీ వైపు వాహనాలను అనుమతి ఇస్తున్నారు. అయితే దీనిపై కూడా ద్విచక్ర వాహనదారులు పెదవి విరుస్తున్నారు. మాసాబ్‌ట్యాంక్, రేతిబౌలి, ఆసిఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి డైవర్షన్ తీసుకోండి అంటూ సూచిస్తూ ట్రాఫిక్ పోలీసులు పెట్టిన సూచికబోర్డులను వాహనాదారులు పాటించడం లేదు.

విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం అవసరం



కార్యక్రమంలో మహమ్మద్ అజహరుద్దీన్, ప్రిన్సిపాల్ రేవ్ బ్రదర్ ఆంథోని

అబిడ్స్: విద్యార్థులకు మంచి విద్యతో పాటు మంచి ఆరోగ్యం కూడా అవసరమని భారత క్రికెట్ టీం మాజీ కెప్టెన్ మహమ్మద్ అజహరుద్దీన్ పేర్కొన్నారు. అబిడ్స్ లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో జరిగిన రోడ్డు సేఫ్టీ, గుడ్ హెల్త్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నాటి నుంచి నేటి వరకు లిటిల్‌ఫ్లవర్ పాఠశాల యాజమాన్యం విద్యార్థులను విద్యతో పాటు క్రీడలు, సామాజిక రంగాలు, సాంస్కృతిక రంగాలు, ఇతర రంగాల్లో తీర్చిదిద్దడంలో నెంబర్:1 స్థాయిలో ఉందన్నారు. ప్రిన్సిపాల్ రేవ్‌బ్రదర్ ఆంథోని మాట్లాడుతూ..తమ పాఠశాలలో విద్యార్థులకు విద్యకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో ఆరోగ్యం, ఇతర రంగాలపై కూడా అదే ప్రాధాన్యత ఇస్తూ వారికి ప్రత్యేక అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలీక్యూర్ రహ్మాన్, డాక్టర్ నీదాఫాతీమా హజారి, డాక్టర్ ఆశీష్ చౌహాన్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అజిత్‌కుమార్, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఈఎన్‌టీ ఆసుపత్రిని సందర్శించిన డీఎంఈ



సుల్తాన్‌బజార్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్ అన్నారు. శనివారం కోఠిలోని ఈఎన్‌టీ ఆసుపత్రిని ఆయన అకస్మాత్తుగా సందర్శించారు. ఆసుపత్రిలోని ఓపీ, ఇతర వార్డులలో అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. వివిధ వార్డుల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రతతపై ఆయన ఆరా తీశారు. అలాగే ఆసుపత్రి ఆవరణలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ వ్యవస్థపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనందాచార్యను అడిగి పరిష్కార దిశగా పనిచేయాలని సూచించారు. ఈ విషయం జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత, ఆరోగ్యశ్రీ నిధుల బకాయిలు, టీమ్స్ కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్ల డిప్యూటేషన్, జీతాలు, ఇతరాత్ర సమస్యలపై డీఎంఈకి సూపరింటెండెంట్ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కరుణ, రత్నకుమారి, డాక్టర్ అనిల్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సాంస్కృతిక రంగాల్లో రాణించాలి



వేడుకల్లో స్టాన్లీ విద్యార్థులు

అబిడ్స్: విద్యార్థులు సాంస్కృతిక రంగాల్లో రాణించాలని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల స్టూడెంట్ సపోర్ట్ సిస్టమ్ డైరెక్టర్ డాక్టర్ వి.అనురాధ పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విద్యలో విద్య ఎంత ముఖ్యమో దానికి అనుగుణంగా ఇతర స్కిల్స్ అంతే ముఖ్యమన్నారు. చాపల్ రోడ్డులోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అనురాధ మాట్లాడుతూ..కళాశాలను తమ సొంత ఇంటిలాగ భావించి కళాశాల ప్రతిష్ఠను విశ్వవ్యాప్తంగా మరింత పెంపొందించేందుకు విద్యార్థులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. స్టాన్లీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎల్.రాజు మాట్లాడుతూ..మొదటి సంవత్సరం విద్యార్థులు కొత్త ప్రయాణాన్ని మొదలు పెట్టారన్నారు. ఈ నాలుగేళ్ల ప్రయాణంలో సంపాదించే జ్ఞానం, అనుభవం, స్నేహభావ సంబంధాలు జీవితాంతం ఉంటాయన్నారు. కళాశాల కరస్పాండెంట్ కె.కృష్ణారావు మాట్లాడుతూ..విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు ప్రతి రంగంలో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సభ్యులు టి.రాకేష్‌రెడ్డి, ఆర్.ప్రదీప్ రెడ్డి, డీన్ ప్రొఫెసర్ ఎ.వినయ్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీవి.రమణమూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఆకుల రమేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రతిరోజూ ప్రజల మధ్య ఉంటూ వస్తున్నానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చేయడానికి తనతో పాటు తన కార్యాలయ సిబ్బంది కూడా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలీముద్దీన్, సయ్యద్ రఫత్‌హుస్సేన్, మజీద్ తదితరులున్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

చాంద్రాయణగుట్ట: బిహార్‌లో రాష్ట్రీయ జనతా దళ్ పార్టీ విజయం సాధించాలని కోరుతూ చాంద్రాయణగుట్టకు చెందిన సంఘ సేవకుడు మీర్జా రఫిక్ బేగ్ నిత్యం ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయాన్నే 5 గంటలకు ఫజర్ నమాజ్ చేస్తూ తేజస్వీ యాదవ్ గెలుపొందాలని కోరుతూ ప్రార్థనలు చేస్తున్నారు. గతంలోనూ ఈయన అంతర్జాతీయ స్థాయిలో దేశాల మధ్య నెలకొన్న యుద్ధ మేఘాలు తొలగిపోవాలని కోరుతూ చేసిన ప్రార్థనలు ఫలించాయి.



తేజస్వీ యాదవ్ విజయాన్ని ఆకాంక్షిస్తూ రూపొందించిన పోస్టర్‌తో రఫిక్ లాల

కేటీఆర్‌ను కలిసిన ముఖేష్ సింగ్



అఫ్జల్‌గంజ్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గోషామహల్ మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన కేటీఆర్‌ను కలిసి పార్టీ పరిస్థితులను వివరించారు.

'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ ఖాయం'



సత్యనారాయణ

గోల్కొండ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో విజయఢంకా మోగించడం ఖాయమని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. అభ్యర్థి ఎవరైనా సరే తిరుగులేని మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. షేక్‌పేట్ డివిజన్‌లో ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, మంత్రులు జి.వివేక్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. మైనార్టీలే కాకుండా పేద బడుగు వర్గాలు, బసీలు, దళితులు కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ మద్దతు తెలుపుతున్నారన్నారు.

అలరించిన 'ధ్రుపద్' సంగీతం



నాంపల్లి: ధ్రువపద్ గురుకులం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ ఆడిటోరియంలో 'వర్షోత్సవ్'శీర్షికన శాస్త్రీయ సంగీతంలో అత్యంత ప్రాచీనమైన 'ధ్రుపద్' శైలి పరిచయ కార్యక్రమం అలరించింది. ఈ సంగీత కార్యక్రమాన్ని ధ్రుపద్ గాయకులు, ధ్రుపద్ బంధు-సంజీవ్, మనీష్ హాజరై ప్రారంభించారు. సూరదాస్, తులసీదాస్, విద్యాపతి, ఆది శంకరాచార్యులు, కబీర్‌దాస్ వంటి కవులు రచించిన, ధ్రుపద్ శైలిలో స్వరపరచిన పలు కృతులను ప్రదర్శించారు. ముగింపులో భాగంగా పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత అశ్విని భిడే దేశ్‌పాండే ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

సందడిగా గ్రాండ్ పేరెంట్స్ డే



ఆసిఫ్‌నగర్ నారాయణ పాఠశాలలో..

విజయనగర్‌కాలనీ: మెహిదీపట్నం ఆసిఫ్‌నగర్ నారాయణ పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ..చిన్నారులకు పెద్దల అనుభవాలు పాఠాలుగా తెలియజేసి వారు జీవితంలో ఎటువంటి ఒడిదుడుకులనైనా సునాయాసంగా ఎదుర్కొనేందుకు దోహదపడుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణలు, ఆటపాటలు, నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ శశికళ, హైస్కూల్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, ప్రైమరీస్కూల్ కో ఆర్డినేటర్ కె.పర్వానా, ఈ కిడ్స్ కో ఆర్డినేటర్ రష్మిక, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

హరి నారాయణ సేవలు ఆదర్శనీయం



డిప్యూటీ ఐఓఎస్ దంపతులను సన్మానిస్తున్న డిప్యూటీ ఈఓ, టీటీయూ నాయకులు, ఉపాధ్యాయులు

యాకుత్‌పురా: హరి నారాయణ విద్యారంగానికి అందించిన సేవలను ఆదర్శనీయమని విద్యాశాఖ బహదూర్‌పురా డిప్యూటీ ఈఓ పోమ్యనాయక్ అన్నారు. 30న బహదూర్‌పురా డిప్యూటీ ఐఓఎస్-1 హరి నారాయణ పదవీ విరమణ సందర్భంగా తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) ఆధ్వర్యంలో శనివారం హరిబౌలీ రిఫా-యే-ఆమ్ ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేయనున్న హరి నారాయణ దంపతులను, డిప్యూటీ ఈఓతో పాటు టీటీయూ నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. హరిబౌలీ, మొఘల్‌పురా, శాలిబండ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నీరజ, రాంచందర్‌రావు, రామ్మోహన్, శాలిబండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ విజయ్‌భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం



మీర్జా ఎబ్బాక్ అహ్మద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: మూడు దశాబ్దాలుగా నిరుపేదలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తూ ప్రముఖ న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్ న్యాయవాద వృత్తికి ఎంతో వన్నెతెచ్చారని ఎంఎం ట్రావెల్స్ అధినేత మహ్మద్ ముస్తఫా అన్నారు. న్యాయవాదిగా 30 వసంతాలు పూర్తి చేసుకున్న మిర్జా ఎక్బాల్ అహ్మద్‌ను శనివారం టూంబ్స్ చౌరస్తాలోని షేజాన్ హోటల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహ్మద్ ముస్తఫా మాట్లాడుతూ..ఎటువంటి స్వార్థం లేకుండా ఎందరో నిరుపేద కుటుంబాలకు అండగా ఉండి వారికి న్యాయ సలహాలు ఇవ్వడమే కాకుండా ఆర్థికంగా కూడా సహాయం అందించడం మిర్జా ఎక్బాల్ అహ్మద్‌కే చెల్లిందన్నారు. న్యాయవాద వృత్తిలో ఒడుకుదుడుకులను ఎదుర్కొంటూ క్లిష్టమైన సమస్యలను కోర్టులో సవివరంగా వివరించడమే తన విజయానికి కారణం అని మిర్జా ఎక్బాల్ అహ్మద్ అన్నారు. కార్యక్రమంలో మిర్జా అహ్మద్ బేగ్ తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సుల్తాన్‌బజార్: అనాథలకు చేయూతనందించేందుకు క్రియేటీవ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'స్టైల్ పిటారా'ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రమారాణి, వైశాలి, మీనల్ సార్డ, వినిత బల్దీవాలు తెలిపారు. శనివారం కోఠిలోని హస్మత్‌గంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎగ్జిబిషన్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..ఈ నెల 16, 17వ తేదీల్లో రెండు రోజుల పాటు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా భగవతి మహేష్ బల్దీవా, డాక్టర్ స్వేత హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో మహిళలకు సంబంధించిన గృహోపకరణాలు, ఇతర వస్తువులతో కూడిన స్టాల్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌పై వచ్చిన రాబడిని అనాథ పిల్లలు, మహిళల అభ్యున్నతికి వెచ్చిస్తామని తెలిపారు.

శాంతియుతంగా ర్యాలీలు నిర్వహించాలి: డీసీపీ



మాట్లాడుతున్న డీసీపీ స్నేహ మెహ్రా

చార్మినార్: మిలాద్-ఉన్-నబీ వేడుకలను శాంతియుతంగా నిర్వహించాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా సంబంధిత నిర్వాహకులను కోరారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా నిర్వహించే ర్యాలీలలో బాణాసంచా కాల్చ కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం నిర్వహించనున్న సామూహిక ర్యాలీలను పురస్కరించుకొని శనివారం చార్మినార్‌లోని సనా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆమె ఊరేగింపు కమిటీ ప్రతినిధులతో పాటు మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ర్యాలీ సందర్భంగా డీజే ఎట్టి పరిస్థితుల్లో వినియోగించడానికి వీల్లేదు అన్నారు. ఈ సమావేశంలో ముస్లిం మత పెద్దలు, నిర్వాహకులతో పాటు దక్షిణ మండలంలోని చార్మినార్, మీర్‌చౌక్, ఛత్రినాక, ఫలక్‌నుమా ఏసీపీలు, ఇన్స్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ నర్సింహాను సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: వినాయక నవరాత్రులు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేసిన సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ నర్సింహను శనివారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో హిందీ జర్నలిస్టు అసోసియేషన్, జల్‌రామ్‌బాబా మందీర్ చైర్మన్ రిదేష్ జాగిర్దార్, లోహాన మహాజన్ సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సుల్తాన్‌బజార్ పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేసి నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేశారన్నారు. నవరాత్రుల్లో సహకరించిన మండప నిర్వాహకులు, ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు, ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే పోలీస్‌శాఖ, జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్‌శాఖల అధికారులకు వారు ధన్యవాదాలు తెలియజేశారు.



బాక్సింగ్ శిక్షణకు హాజరైన వారితో కోచ్ షేక్ ఏజాజ్ అహ్మద్

బాక్సర్లకు మంచి భవిష్యత్తు

గోల్కొండ: బాక్సర్లకు మంచి భవిష్యత్తు ఉందని నేడు జిల్లా, పట్టణ కేంద్రాల్లో సైతం బాక్సింగ్ పోటీలు నిర్వహించబడుతున్నాయని మాజీ ఉమ్మడి రాష్ట్ర బాక్సింగ్ చాంపియన్, బాక్సింగ్ కోచ్ షేక్ ఏజాజ్ అహ్మద్ అన్నారు. శనివారం గోల్కొండ ఒవైసీ కమ్యూనిటీహాల్‌లోని హైదరాబాద్ బాక్సింగ్ క్లబ్‌లో బాలికల ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాను గతంలో కేవలం వేసవిలో మాత్రమే బాక్సింగ్ శిక్షణ శిబిరాలు నిర్వహించేవాడినని, అయితే వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న విజ్ఞప్తులకు అనుగుణంగా ఏడాది పొడవునా శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈసారి శిక్షణ శిబిరంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన మహిళా బాక్సర్లను పిలిపిస్తానన్నారు. దీన్ని వల్ల బాలికల్లో నూతన ఉత్సాహం ఉప్పొంగి వారు బాక్సింగ్‌పై మరింత శ్రద్ధ కనబరిచే అవకాశం ఉంటుందన్నారు. బాక్సింగ్ కోచింగ్ క్యాంప్‌లో పాల్గొనేదలచుకునే వారు 9396618800లో సంప్రదించవచ్చు.

నేడు పాతబస్తీలో మిలాద్ ర్యాలీ

చార్మినార్: మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఆదివారం నిర్వహించే మిలాద్ ర్యాలీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం పలు వాహనాల్లో సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నారు. మక్కా మసీదు నుంచి బయలుదేరే ఈ ఊరేగింపు గుల్జార్ హౌజ్, పత్తర్ గట్టి, మదీనా, దారుషిఫా, పురానిహవేలీ, మీరాలంమండి, కోట్లా అలీజా, మీర్ చౌక్ పోలీస్ స్టేషన్, ఎతేబార్ చౌక్, బీబీ బజార్ చౌరస్తా ద్వారా వోల్గా హోటల్ వరకు చేరుకుంటుంది. అక్కడి నుంచి తిరిగి మక్కా మసీదు వరకు కొనసాగనుంది. అదేవిధంగా ఫలక్‌నుమా నుంచి మక్కా మసీదు వరకు మరో ర్యాలీ కొనసాగనుంది.

ప్రత్యామ్నాయ మార్గాల్లో ఏర్పాట్లు..

పాతబస్తీలో మర్కజి మిలాద్ ర్యాలీ నిర్వహిస్తున్నందున ఆయా ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయని నగర ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ డి. జోయల్ డేవిస్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ముందుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అత్యవసర పరిస్థితిలో, ప్రయాణికులు ప్రయాణ సహాయం కోసం 90102 03626లో సంప్రదించాలని సూచించారు.

ప్రధాన ఊరేగింపులు కొనసాగే ప్రాంతాలు ఇవే..

- ఫలక్‌నుమా నుంచి చార్మినార్ ద్వారా వోల్గా హోటల్‌కు.
- యాహియా పాషా దర్గా నుంచి వోల్గా హోటల్‌కు మళ్లీ తిరిగి అక్కడికే.
- మక్కా మసీదు నుంచి నాంపల్లిలోని హజ్ హౌస్ వరకు.
- మక్కా మసీదు నుంచి మొగల్‌పురా వోల్గా హోటల్ వరకు.
- పత్తర్ గట్టి నుంచి అలీజా కోట్ల వరకు.